
# తిరుపతి

దేవాలయంలో మా అమ్మతోపాటు నేనూ చేతులు చిన్ననాట జోడించాను. చదువుతో పెరిగి పాశ్చాత్య సాహిత్యపు చెరువులో యీదుతున్నప్పుడు గుడ్డిగా నమ్మే తత్వం పోయి హేతువాదం మీద మక్కువ యేర్పడింది. నా దృష్టిలో దేముడు, భక్తి నిరూపించలేని గణితసమస్య లైపోయాయి. ఏ మత గ్రంధం తీసుకున్నా చావుని సృష్టించిన దేవు డనే శక్తికి భయపడ్డ మానవుల చరిత్రే అగుపిస్తుంది. మానవుల మమకారం వలన వుద్భవించిన కోరికల పోట్లాట మధ్యకు దేవుని నానా రూపాలతో యీడ్చుకొచ్చారు. అతనికి వెర్రి ఆవేశాలతోకూడిన పూజలు, పునస్కారాలు, భక్తి, ఆరాధన లంచంగా యిచ్చారు. వెర్రి ఆవేశం సాధారణంగా పిరికివాళ్ళ సొత్తు

మనిషి స్వభావంగా పిరికివాడు. ఆ పిరికినుంచి దూరందూరంగా పోడానికి అగపడని దైవశక్తిని కొలిచే బదులు, కనిపించే మానవశక్తిపై ఆధారపడగలనేమోనని ప్రయత్నించి చూశాను. తను చేసిన ప్రతి పనియొక్క ఫలితాన్ని ఆత్మ అనే త్రాసులో వేసి మంచిచెడుగులను నిర్ధారించుకోగలిగే శక్తి మనిషికి వుంది. కాబట్టి దానిని నేను వినియోగించగలిగితే పిరికికి రాను రాను దూరమౌతానని నమ్మాను.

ఆ ప్రయత్నంలో నా అహం ఎన్నోసార్లు నన్ను విఫలునిగా చేసినా, మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తున్నాను. రోజూ రాత్రి నిద్దరపోయేముందు. ఆ రోజు నా జీవితంలో గడచిన సంఘటనలు ఒకసారి సాంతంగా పరిశీలించుకోడానికి ప్రయత్నిస్తుంటాను. ఒక బంట్రోతుపై నేను అనవసరంగా కేకలు వేశానని నాకు తట్టితే మరుచటిరోజు వుదయమే సిగ్గుపడకుండా క్షమాపణ కోరుకుంటాను. నా తోటిఆఫీసరు గురించి గుప్తంగా యింకొకనితో చెడ్డగా చెప్పితే అలా అతని గురించి మాటాడానని నా తోటి ఆఫీసరుతో మరుచటి రోజు చెప్పుకుంటాను. అతను నాపై అసహ్యించుకొనే బదులు నన్ను గౌరవిస్తాడని నాకు తెలుసు.

మొనమొన్న కలంపట్టి నాకంటే పేరు ప్రఖ్యాతులు గడించుకున్న ఒక రచయిత్రి కధలపై "యెన్నాళ్ళవి నిలుస్తా"యని నా అభిప్రాయం యిచ్చాక ఆ మరుచటి రోజు ఆ వ్యక్తిని కలుసుకుని "క్షమించండి తప్పు అభిప్రాయం ఇచ్చాను. ఆమె వ్రాసిన కధలేవీ నేను చదువలే"దని చెప్పుకుంటాను. ఇలా రాత్రి నిద్దరపోయే ముందు జరిగే యీ సింహావలోకనం చేసిన తప్పులను దిద్దుకోడానికి చేసే



ప్రయత్నం రాను రాను నన్ను పిరికికి దూరంగా తీసుకుపోసాగాయి. మనిషే ఒక దేవాలయమని, అతను మనిషిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే, కనీసం తనలోని దేవుని నీడనైనా చూడగలడనే నమ్మకం నాకు కలిగింది. అంచేత నాకు విగ్రహారాధన ఎబ్బెట్టుగా తోచింది.

మా ఆవిడ కాపరానికి వచ్చాక పూజా పునస్కారాలు యింట్లో తప్పనిసరైంది. వేరేగా నా పడకగది ప్రక్కగదిలోనే పూజగది పెట్టుకుంది. ఆమె వుదయం అక్కడ వాయించిన గంటమ్రోతతో నాకు తెలివి వచ్చేది. నా ఆరోగ్యం బాగుండాలనీ ఇంకేవేవో మ్రొక్కుకొనేది. ఒకరి విశ్వాసాలను భంగపర్చడం నాకు ఇష్టంలేదు. ఆమెతో పాటు దేవాలయాలకు వెళ్ళేవాడిని. లోనికి వెళ్ళటానికి టికెట్లు, గర్భగుడిలో మనుషుల త్రోసుకోడాలు నాకు నచ్చేవి కావు. ఆలయంలో దేవతా విగ్రహాలకంటే మనుషులు చెక్కిన రాతిబొమ్మలు ప్రాణం పోసుకొని నాతో మాటాడేవి. ఒకో విగ్రహంలో అది చెక్కిన శిల్పకారుని జీవిత సంఘటనలతో వేగిన హృదయం కొట్టుకునేది. అతను గతించినా అతని ఆత్మను విగ్రహంలో వదిలిపెట్టాడు. ఈ శిల్ప విన్యాసం ప్రధాన దేవాలయాల్లో లేకపోతే దేవాలయాలకు పోయే అలవాటు క్రమేణా చాలావరకు యీ సరికి మానిపోను, ఎంత ప్రయత్నించినా మా ఆవిడ తనతోపాటు ఉదయం పూజగదిలో నన్ను చేతులు జోడింపచేయలేకపోయింది. ఇంట్లో యెలాంటి యిబ్బంది వచ్చినా దానికి కారణం నేను దేవుని ధిక్కరించటం వలనే వచ్చిందని మా ఆవిడ శాంతంగా చెప్పేది.

తరువాత నాకు ఒకసారి తప్పని జబ్బుచేసింది. అప్పుడు నేను కలల్లో

మా గ్రామంలో వున్నాను. ఆరోజు నోట్లో యేంవేసినా వాంతి అవుతోంది. ఏ వుప సాధనాలు చేసినా వాంతులు తగ్గలేదు. మంచంమీద నీరసంగా పడుకొని వున్నాను. అప్పుడే చీకటి పడుతోంది. మా నాలుగేండ్లు నిండిన అమ్మాయి ఉష మిగతా పిల్లలతో వరండాలో ఆడుకుం టోంది. మనసులో నీరసం వలన యెన్నెన్నో చెడ్డ ఆలోచనలు పుట్టు న్నాయ్. ఊళ్లో వైద్యుడులేడు తిరిగి పట్నం పోవడానికి శక్తిలేదు. వర్షం పడ్తుంటే గొడుగులేనివానిలా, మండు టెండలో జోళ్ళు లేకుండా నడవవల్సి వచ్చిన మనిషిలా అయిపోతున్నాను. ఇంతలో ప్రక్కగదిలో గంటమ్రోత విని పించింది కాస్సేపయ్యాక మా అమ్మ వచ్చి యిచ్చిన రూపాయి నా ముందు మూడుసార్లు త్రిప్పి పసుపురాసినగుడ్డలో ముడుపు కట్టింది.

"ఎందు" కన్నాను ?

"దాతా దైవం రెండూ వుండాలిరా!" అంది

నవ్వుకున్నాను. అమ్మ వెళ్లాక ఒక్క డినే హరికేన్ లాంతరువేపు చూస్తూ మా అమ్మ తిరుపతి వెంకటేశ్వరునికి యిస్తున్న లంచం తక్కువే నని పరిహా సాలాడుకుంటున్నాను. ఇంతలో మా ఉష గొంతుకవిన్పించింది. కమ్మగా గొంతెత్తి.

"తిరుపతి వెంకటేశ్వరా దొరా
నిన్నే నమ్మినాడరా."

ఆ పాట మా ఉష నోటివెంబడి ఇది వరకు వినలెదు. ఇప్పుడ యిలా వచ్చిందు; యెందుకొచ్చింది? ఇది సాధారణ సంఘ టనగా నామనసు తీసుకోలేక పోయింది. ఈ పాపనోట యీ సమయంలో యీ పాట రావానికి యేదో ఒక మహత్యం వుండాలన్న ఆలోచనలు నాలో సహ జంగా రాజుకున్నాయ్. తెల్లారి నాకు తెలివి వచ్చేసరికి నా చేతిని యెవరో పట్టుకొని వున్నారు. ఏదో కలగని చప్పున తెలివివచ్చినట్లు చూశాను

మా డాక్టరుబావ: "మీరు మద్రాసు వెళ్ళారుగా? ఎప్పు డొచ్చారు? నా ఒంట్లో బాగులేదని మీ కెలా తెలు" సన్నాను ?

"నిన్ననే వచ్చాను. మీ ఒంట్లో బాగు లేదని మీరు నాగురించి తలచు కుంటున్నారని కల వచ్చింది. తెలివి రాగానే కారుచక్రం పట్టుకున్నాను."

ఎందుకో తొలిసారిగా నా శరీరం గగు ర్పాటు జెందజొచ్చింది. అతనోరోజుండి కారులో నన్ను పట్నం తెచ్చేశారు; కోలుకునేసరికి పక్షంరోజులు పట్టింది. ఆరోగ్యం కుదుటపడ్డాక మా ఆవిడకూ నాకూ రోజూ పేచీయే ఒక డబ్బీలో, శనివారాలు తిరుపతి వెంకటేశ్వర స్వామికిమ్రొక్కు డబ్బులు వేయమనేది. దేవుడికి లంచం యిచ్చి పాపం ఒడి గట్టుకోనని నేను – ఆ దేవుడు వడ్డి కాసులవాడనీ, ఆ డబ్బు అవసరం ఆ దేవుని కెలా వుందో ఆ పురాణగాథ అంతా చెప్పుకొచ్చేది. అయినా నా

బదులు ఆమె ఆపని చెయ్యవలసివచ్చేది. కాలంలో ఋతువుల్లా మనిషి జీవితంలో ఒడుదుడుకులు వస్తుంటాయ్. దేవుడు ప్రేమమయుడని ఒప్పుకొని, అతను కోపంతో ఆపదలు సృష్టిస్తాడంటే నాకు నమ్మకంలేదు. కొడుకు తప్పు చేస్తే కన్నతల్లి ఆప్యాయతతోనే మందలిస్తుంది. అప్పుడు కొడుకు తల్లికి లంచం యివ్వడు. అలానే మనిషికి కష్టాలు దేవుని మందలింపు లాంటిది. అవి దేవుని ఆప్యాయత వల్లనే వస్తవి. ముడుపులు కట్టి పూజలు చేసి దేవునికి లంచం యిచ్చి యీ కష్టాలనించి విముక్తి పొందటం నాకు అసహజంగా తోచింది.

రెండేళ్ళవరకూ మా ఆవిడ ప్రతి శని వారం యేదో ఒక సమయాన యింకా స్వామిదర్శనం చేసుకోలేకపోయా మని బాధపడేది. ఏదో ఒక సాకుతో తప్పించు కునేవాడిని. ఆ మధ్య ఒకరోజు మరి కోపాన్ని యెంతకాలం అణచుకోలేక "ఏదో సాకు చెప్తూ యిలా మొక్కుబడి తీర్చటం ఆలస్యం చేస్తున్నారు."

"ఏం మొక్కుబడి ?"

"ఆ రోజున నేనూ అత్తయ్యా మొక్కుకున్నాం."

"ఏమని ?"

"మీ జుత్తు యిస్తామని."

"నా జుత్తువిషయం మీ కధికారం యెవ రిచ్చారు ?"

మా ఆవిడ కళ్ళల్లో నీరు తిరిగి పోయాయ్. ఓ క్షణం పోయాక "నాకు మీమీద అధికారం లేకపోతే పోయె; ఆ వెంకటేశ్వరస్వామికి మీ లాంటి మనుషుల అందరిమీదా వుంది "

"ఆ అధికారం, ఆ మహత్యం వుంటే నేను వచ్చేవరకూ యెందుకు యెదురు చూడాలి? నన్ను రప్పించుకో కూడదూ ?"

"ఆ స్వామి పిలిస్తే పలికే దేముడు. అలా తూలనాడకండి."

"నాకు గ్రుడ్డిగా యేదీ నమ్మమని చెప్పకు."

మా ఆవిడ పెద్దగా నిట్టూర్చింది.

"మనసులో యేదో వుంది చెప్పు." అన్నాను.

"ఆ మధ్య రైల్లో ఒక గ్రుడ్డివాడు అడుక్కుంటూ అన్నమాటలు జ్ఞాపకానికి వచ్చాయ్ "

"ఏం టా మాటలు ?"

"మనిషి గుడ్డివాడు గానీ, దేవుడు గుడ్డివాడు కాదు బాబయ్యా అని."

"అయితే నేను గ్రుడ్డివాడిననా నీ అభిప్రాయం ?"

"మీరు గుడ్డిగా యేదీ నమ్మరుగా ! మీరు గుడ్డివారని యెందు కనుకోవాలీ ?"

ఇంతచిరాకుగా మా ఆవిడ యెప్పుడూ నామీద లేవలేదు. పరిస్థితి విషమిస్తోందని కామోసు నావేపు చూడకండా అక్కడినించి వెళ్ళిపోయింది.

ఆ వారం రోజుల్లో ఆమె పూజలు మరికాస్త హెచ్చినట్లు అగుపించాయ్. చీకటి పడ్డాక పూజగదిలో దీపం ముట్టించి వెంకటేశ్వర స్వామిపై ఆమెకు వచ్చిన పాటలూ పద్యాలూ అన్నీ పాడుకునేది. ఒక రోజు మా డాక్టరుబావ హడావుడిగా వచ్చాడు.

"వచ్చే వారం మన తిరుపతి ప్రయాణం" అన్నాడు.

"మొక్కుబడులు వుండిపోయాయా?"

"తలపించి యీ వుంగరాల జుత్తు అర్పించటం! మీరూ చెయ్యండి హాయిగా వుంటుంది"

"ఇదివరకు చేశారన్నమాట!"

"ఇది నాలుగోసారి మనసు గందరగోళంగా వున్నప్పుడల్లా తిరుపతి పోయి, గుండు చేసుకోగానే అన్ని చికాకులు పోవటం సహజం. ఈసారి కారులో పోతున్నాం. మీరూ చెల్లెమ్మా రావాలి"

"నాకు చన్నీళ్ళ స్నానం చేస్తే రొంప చేస్తుందండీ"

"నిజమే, కానీ, పుష్కరిణిలో చలిలో స్నానం చెయ్యండి: మీకేం కాదు."

"నేను నమ్మను"

"చేసి చూడండి. మీకంత భయమైతే వేన్నీళ్ళు అక్కడ ప్రతి బంగళాలోనూ వుంటుంది"

"హోటలు భోజనం నాకు పడదు."

"వెంకటేశ్వరస్వామి పేరు చెప్పి తినండి. మీకు నా దగ్గర వున్న మందు కూడా అక్కర్లేదు"

"డాక్టర్లు! మీకీ పిచ్చి నమ్మకాలు యెలా అలవడ్డాయ్."

"అనుభవించాక..."

"ఆయనకే నమ్మకాలూ లేవన్నయ్యా! ప్రయాణం యెలా తప్పించుకుందామా అని యీ సాకులన్నీ చెప్తున్నారు." మా ఆవిడ అందుకుంది.

"ఒకసారి వస్తే ఆయనకే నమ్మకం కలుగుతుంది"

"మనదగ్గర ఆ మాటలు చెప్పకండి"

"మన ప్రయాణం ఐదువందల మైళ్ళు తెలుగుగడ్డమీద జరుగుతుంది మీ కెన్నో విషయాలు తెలుస్తాయ్. రాకూడదూ?"

"అలా అంటే వస్తాను."

మా ఆవిడ గబగబా పూజగదిలోకి పరుగెత్తింది. డాక్టరుబావ నవ్వుతూ, "మీకు విగ్రహారాధన అంటే గిట్టనట్టుంది. అలాంటిది నేను రాగానే నాకు నమస్కరిస్తా రెందుకూ?"

"అలా చేసి మర్యాద యిస్తున్నాను"

"అయితే వేలాది సంవత్సరాలు కోట్లకొలదీ ప్రజలు మొక్కిన వెంకటేశ్వరస్వామికి మనం సాష్టాంగ పడితేలా?"

"ఆ విగ్రహానికి ప్రాణం లేదుగా!"

"ఉందో లేదో మీకే తెలుస్తుంది. పదండి."

ఆ మరుపటి గురువారం రాత్రి పదకొండు గంటలకు దీపాల ధగధగల

మధ్య. దోమలూ, ఈగల బాధతో. కుళ్ళు కాలువల కంపుతో నిద్దర పట్టక నీరసంగా నున్న విశాఖపట్నాన్ని విడిచిపెట్టాం. అంత రాత్రి వేళ కూడా అనకాపల్లి పెద్దవీధిలో బెల్లందిమ్మలపైపు మూగే ఈగల్లా ప్రజలు కదుల్తున్నారు ఆదికవి మొదలు హాస్యబ్రహ్మవరకూ, కవితకు పెళ్ళి పందిళ్ళు వెయ్యించుకున్న రాజమండ్రి అలసిపోయి నిద్దరపోతోంది. కాటన్ మహాశయుడు వేసిన కంఠాభరణం ఒక్కడక్కడా తెగినట్లుంది ధవళేశ్వరం ఆనకట్ట. చింతతో ఏడ్చి ఏడ్చి చెరువుగా మారిన గోదావరిలోనికి చూస్తే—

"ఎండ కొండాలేక నిండుసీకటివేళ
ముండ్లలో ఏడ పోతావే చంద్రమ్మ
ముందు గోదావరున్నాదే చంద్రమ్మ
గోవింద అని నువ్వు గోదారిలోపడి
దేవతల్లో కలిసి నావా చంద్రమ్మ
నే నింక బతికే వున్నానా చంద్రమ్మ
(పేరు తెలియని కవి)

ఏలూరు యెందుకో ఏకాంతంగా ప్రియునికోసం ఎదురు చూసిచూసి మునలైన మగువలా కనిపించింది. విజయవాడ రణరంగంలో కాస్సేపాగి చూద్దును కదా — మాటల కత్తులతోపాటు కవిత్వపు కలాలతోకూడా జనం. పోట్లాడుకుంటున్నారు. గోంగూర పచ్చడిలాంటి ఘాటు యెండను ఒళ్ళంతా పులుముకున్నా గుంటూరును చూడగానే నా నోరూరిపోయింది. నెల్లూరు నడివీధిలో కారు మెల్లగా కదులుతుండగా మేడమీద ఒంటిగా నిల్చొని తొంగితొంగి చూసిన నెలజాణ చూపు మళ్ళీ తిరుపతి వెళ్ళే వరకు మనసునుంచి తుడిచి పెట్టలేకపోయాను ఈ అయిదువందల మైళ్ళ ప్రయాణంలో — భూదేవి పండించిన పచ్చదనం, సూర్యచంద్రులను చుక్కలను వెలుగుతో వెదజల్లి, గాలికుంచెతో వందలాది మేఘాల రంగుచిత్రాలను సృష్టించిన ఆకాశం, దిక్చక్రాన్ని అందుకోవాలని నాకంటే ముందుగా పరుగులెత్తే బాటలాంటి నా భావాలు. ఆ భావాలకన్య కౌగలిలో పొందిన పారవశ్యంతో నన్ను నేను మరచిపోయాను.

తిరుమలకు యెగబ్రాకుతుంటే యెన్నెన్నో ఆలోచనలు కలిగినయ్. నూతిలోని కప్ప గట్టుపై కెగబ్రాకినట్లు, మనిషి తొలిసారి విమానం యెక్కి అక్కడినించి ప్రకృతిని చూసి యిన్నాళ్లు తను అసహ్యించుకున్నది ఇంత అందమైనదా అని ఆశ్చర్యపడ్డట్టు చుట్టూ చూశాను. ఇన్నివందల మైళ్ళు దేనికోసం యెదురుచూడకుండా ప్రయాణం చేసి యిప్పుడే దేనికోసమో ఆతృత పడినట్లు అనిపించింది.

తిరుమలలో కొన్ని జుగుప్స గలిగించినయ్. దేవునికి సంబంధించిన

ప్రదేశాలలో వాటికంటే ముఖ్యమైన వన్నట్లు వ్యక్తుల పెద్ద ఫొటోలు వ్రేలాడదీసారు. ప్రయాణీకుల సౌకర్యంకోసం యిల్లు కట్టించి వాటి మొఖం మీద దాతల పేర్లు చెక్కించుకున్నారు. స్వామి విగ్రహం నమూనాలు నిజాయితీలేని వ్యాపారంలా సాగిపోతోంది. కొందరు ప్రత్యేక దర్శనం యేర్పాటు చేసుకొని స్వామివద్ద తమ అధికారాన్ని చూపిస్తున్నారు. ఆలయానికి సంబంధించని ఖర్చులు చేసే బదులు, సాంచీద్వారాల ఘాట్ రోడ్డుమీద అక్కడక్కడా పేరు పడ్డ ఒక్కొక్క శిల్పిచేత ఒక్కో ద్వారం వేయిస్తే ముందుతరాలవారు మన జీవిత విశేషాలను అవగాహన చేసుకోటానికి వీలుంటుంది. అప్పుడు తిరుపతి అంతర్జాతీయంగా యాత్రాస్థలమౌతుంది.

ఆ రాత్రి తిరుమలలో బంగళా వరండాలో పడుకున్నాను. మా ఆవిడ క్రింద రొంపపట్టుంది, వద్దన్నా బయటనే పడుకున్నాను. తెల్లారి లేచేసరికి చలితో పాటు అంతా పొగమంచు ఆ దృశ్యం చూడటానికి మనోహరంగా వుంది. డాక్టరుబావ "రొంప పట్టలేదుకదూ?" అని ప్రశ్నించగానే ముక్కు పట్టుకున్నాను. నాకే ఆశ్చర్యంవేసింది మా డాక్టరుబావ తలనీలాలదగ్గర నాకూ టికెట్టు తీసినా, అలా నిల్చున్నానే కాని నా జుత్తు అందివ్వాలని అనుకోవటం లేదు. ఆయన తలవంచి గోవిందా అనగానే నా మనసులోనూ గోవిందా అని మారుమ్రోగింది. నా చుట్టూ ఆడా మగా, పిల్లాపిచ్చికా, చిన్నాపెద్దా అంతా గోవిందా అంటూ జుత్తు అర్పిస్తున్నారు. మా బావ గుండు గబగబ తడుముకొని "హమ్మయ్య, హాయిగా వుంది" అంటూ ఒక్క యెగురు యెగిరాడు.

"వేగం కానీయండి" అన్నాడు. తరువాత, "గోవిందా గోవింద" అని ఉద్రేకంగా అరిచాడు. అతను యెంతో ఆనందంతో పరవశుడైనట్లు అతని చేష్టలు ముఖభంగిమలు చెప్తున్నాయ్. అతను నా కంటికి తెల్లనివాడు నీలంగా మారిపోయినట్లనిపించింది. ఎవరో చప్పున చెయ్యిపట్టుకొని క్రిందకు లాగినట్లనిపించి కూర్చుండిపోయాను. తల వంచాను. గోవిందా అని మనసులో అనుకున్నాను.

"ఇప్పుడు హాయిగా లేదూ?"

నా నోట జవాబు రాలేదు. ఏదో మత్తు నన్ను ఆవరించింది. మెల్లగా కదలి పుష్కరిణిలో చలివేస్తున్నా, నీరంతా ఆకుపచ్చగా కనిపిస్తున్నా మా ఆవిడతో కలసి మునిగాను. క్యూలో నిల్చున్నాను. ఎవరో త్రాడుకట్టి తనవేపు లాగుతున్నట్లనిపించింది. దూరంనించే శ్రీ వేంకటేశ్వరస్వామిని చూశాను. నా కంటి రెప్పలు పడలేదు. అలా చేతులు జోడిస్తూ ముందుకు కదిలిపోయాను. ఆదగ్గరకు

వెళ్ళగానే నా కంటికి అంతా వెలుగుగా గోచరించింది స్వామి విగ్రహంగా అగ పడలేదు నా వేపు కదలి నా హృదయం లోనికి చూస్తున్న ట్లనిపించి. ఒళ్ళంతా గగుర్పాటు జెందింది. చేతు లెత్తి మ్రొక్కాను. ఎంతసేపైనా ఆ మూర్తి వేపు చూడాలన్న భ్రమ నన్ను వదల కండానే నేను కదలవల్సివచ్చింది కదు లుతూ కనిపించేవరకు ఆగిఆగి వెను తిరిగి చూశాను. ఇలా ఏ దేవాలయం లోనూ యిం కేవిగ్రహం నన్ను యిలా తిరిగి తిరిగి చూసేటట్లు చెయ్యలేక పోయింది.

మా ఆవిడతోపాటు నేను హుండీలో డబ్బు వేశాను ఒకమూల కూర్చున్నాం. ఎందరో కనిపిస్తున్నారు. ఎన్నో విధా లుగా తమ భక్తిని యెరుకపరుస్తున్నారు. బంధు ఆదరణ, భోజన వసతులతో ఆచరణలో పెట్టి యెలా చూపిస్తారో దేవునిమీద భక్తి యేదో ఆచరణలో పెట్టి చూపించటంలో అసహజ మేమీ లేదు. ఒకావిడ ఒకేకొడుకు ఆరోగ్యం కుదుటపడిందని నేలమీద దొర్లుతూ గోవిందా అని ఆవేశంతో కదులుతోంది ఇంకో వ్యక్తి వేంకటేశ్వర గానామృ తాన్ని సేవిస్తూ చిందులు త్రొక్కు తున్నాడు. దీపారాధన దివ్యనామ సంకీ ర్తనతో ఆ ప్రదేశమంతా నిండిపోయింది.

స్వామి దర్శన మయ్యాక నా మనసు లోని చీకటి గదులు యిప్పుడు వెలిగింప బడ్డాయి. అందుకే సరిగ్గా ఆలోచించ గలిగాను. ఏడుకొండల వెనక అడవిలో యే మానవమాత్రుడూ ఒక విగ్రహాన్ని సృష్టించలేడు. విద్యుచ్ఛక్తి ఒకచోట వుత్పత్తి అవుతుంది. దాని పంపిణీ అక్కడక్కడా చిన్న సబ్‌స్టేషన్ల ద్వారా జరుగుతుంది దేవుడు ఒకచోట వుత్పత్తి అయ్యే శక్తి అనుకుంటే, ఆ శక్తి మానవమాత్రులకు అందివ్వటానికి ఇలా అక్కడక్కడా పుణ్యక్షేత్రాలు సబ్‌స్టేష న్లలా వెలుస్తాయ్. ఈ విగ్రహాలలో శక్తి లేదంటే హాస్యాస్పదంగా వుంటుంది. ఆ కొండల మధ్య వెలసిన విగ్రహం శక్తిలేకపోతే యిన్ని వేల సంవత్సరాలు—కోట్లకొలది మగ, ఆడ పిల్లలను మంచివాళ్ళనీ, చెడ్డవా ళ్ళనీ, మునులను, రాజులను, హంతకు లను, ఆచార్యులను, తలవంచి భక్తితో గోవిందా అని కీర్తించేటట్లు చెయ్యలేక పోయేది...

తిరుగుదలలో ఇదివరకు అసహ్యిం చుకున్నవాటినికూడా తృప్తితో చూడ గలిగాను. నేను గాఢంగా ప్రేమించే నా శరీరంలో కూడా యింపూ, కంపూ రెండూ వున్నాయ్. మనుష్యుల్లోనూ, ప్రకృతిలోనూ యీ చీకటి వెలుగులు స్వామి చేతుల్లో కదుల్తూ వుంటాయ్. దేవిమీదా నేను ఆధారపడే అవసరం

లేదన్న భావం నాలోనించి పూర్తిగా తుడుచుకుపోయింది. నేను మంచి దను కున్న కథ తిరిగి వచ్చేటప్పుడు, ఒక రికి చేసిన వుపకారానికి నేను అపకారం పొందినప్పుడు, నా తప్పు కాకపోయినా నేనే దూషింపబడేటప్పుడు, నా కంటే మూర్ఖుడైన నా పై అధికారి నాపై అనవ సరంగా చికాకుపడినప్పుడు, తెలివైన నా క్రిందివాడిని నేను సందర్భం లేకండా కించ పరిచినప్పుడు, నా విలువ తెలు సుకోకండా యెవరో గుసగుసలాడి నప్పుడూ — ఇలా నిత్యజీవితంలో బాధించే యెన్నో సంఘటనలు జరుగుతు న్నప్పుడు నేను దిగులతో దీనంగా ఒకో సారి దిగజారిపోతుంటాను. అలా నీర సంగా వునప్పుడు నిల్చోటానికి వూత కావాలి. ఆ మండుటెండ భరిస్తూ నడవ టానికి నాకు జోళ్ళు కావాలి. ఆ వర్షంలో ముందుకు పోటానికి నాకు గొడుగు కావాలి. నా స్వయంశక్తితో నా ఆనకట్టలోని పగుళ్లను పూడ్చుకోటానిక ప్రయత్నించినా ఆ విశ్వప్రయత్నానికి దీక్ష కావాలి. నా మనసులోని చీకటిగదు లను వెలిగించుకోవడానికి శక్తి పైవించి పోయే యెలక్ట్రిక్ తీగలనించి రావాలి. ఆ వూత, ఆ జోళ్ళు, ఆ గొడుగు, ఆ దీక్ష, ఆ యెలక్ట్రిక్ తీగెలు దేవునిమూర్తి ఎదరగా భక్తితో తల వంచితేనేగానీ నేను పొందలేను. ఇంకో విధంగా పొందినా నా దగ్గర అన్నివేళలలోను వుంచుకోలేను.

భక్తి ఒక మంచిమీది నమ్మకం లాంటిది. ఈ దేవతా విగ్రహాలు ఒక ఫిల్ము లాంటివి ఫిల్ము లేకపోతే నా మనసు తెరపైన దేవుని ఆకారం పడదు. దేవుని ఆకారం మనసులో పాతుకుంటేనే భక్తి వుండే అవకాశం కలుగుతుంది. మన సులో భక్తివుంటేనే మనిషి తన కుటుం బానికి, సంఘానికి, దేశానికి, మంచికి, న్యాయం చేకూర్చి జన్మసాఫల్యం పొంద గలుగుతాడు. అందుకోసం నేను వేంకటేశ్వరస్వామిని రోజూ పూజిస్తాను

మా కారు వేగంగా విశాఖవేపు కదలి పోతున్నా నా ఆలోచనలు వెనుకకు లాక్కుపోతున్నాయ్. నాకు మళ్ళీ యెన్నో సార్లు తిరుపతి వెళ్ళాలని "విశ్వరూపు డైన ఆ వేంకటేశ్వరస్వామి అమృత రూపాన్ని మళ్ళీ మళ్ళీ దర్శించి, అతని దయామృతం యేరై పారగా, అందలి అలలవంటి అతని కరుణా కటాక్ష వీక్ష ణములతో నా బాధలను చల్లార్చుకోవా లని నా మనసు తహతహ లాడింది.

సర్వావయవ సౌందర్య సంపదా సర్వ
చేతసామ్

సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ
మంగళం॥